


ఆషాఢమాసం!

ఆషాఢమాసం యింకా ఎన్నిరోజులుందో, వెళ్ళిపోయిందో ఆ వివరాలు నాకు తెలీదు. ఈ నెల ఆషాఢమాసమని ఎవరో చెప్పగా విన్నాను. ఆషాఢమాసమనగానే కొత్త జంట గుండెల్లో గుబులెక్కువవుతుంది. ఈ నెలలో అత్తాకోడళ్ళు ఒకే ఇంటిలో ఉండకూడదు గనక అమ్మాయిగారూ, అబ్బాయిగారూ నెల్లాళ్ళపాటు టెంపరరీగా విడిపోవాలి. అంచేత మళ్ళా ఎన్నాళ్ళకోగదా అనే దిగులెక్కువవుతుంది. ప్రియతమా మరచిపోకుమనే విషాదగీతా లెక్కువవుతాయి. హీరోలు బారుల్లో కనిపిస్తారు. హీరోయిన్లు వియోగబాధని తట్టుకోలేక పరుపు మంచాలెక్కి గది తలుపు లేసుకుంటారు.

ఈ సీజన్‌లో వెన్నెల వేడిగా వుంటుంది. మల్లెపూలు చిరాగ్గా వుంటాయి. ఇట్లా ఎన్నాళ్ళెన్నాళ్ళని నిట్టూర్పులూ, నిస్పృహలూ ఎక్కువవుతాయి.

ఆషాఢ మాసానికి కూడా ఓ ఫిలాసఫీ వుందని ఎవరో చెబితే విన్నాను. గారెలు బాగున్నాయి కదాని చెప్పి కడుపు పగిలేలా తింటే జన్మకి మళ్ళీ గారెలు ముట్టుకోగూడదని పిస్తుంది. గారెలేకాదు, ఏదయినా అంతే. అతి మంచిదికాదు. ఎక్కడోచోట గేప్ అంటూ ఏడవాలి. పెళ్ళయిన కొత్త జంట ఈ సూత్రం మరిచిపోయి పగలూ, రాత్రి, వారం, వర్జ్యం ఏమీ పట్టించుకోకుండా గడుపుతారు. ఈ విశాల విశ్వంలో నాకు నువ్వే, నీకు నేనే అని బాసలు చేసుకుని ఒకరి నొకరు అతుక్కుపోతారు. విరామం లేకుండా ఈ విధంగా అతుక్కుపోవడాలు ఎప్పుడో వకప్పుడు మొహమొత్తింపే స్తాయి. ఆషాఢ మాసమంటూ లేకపోతే బ్రేకు ఉండదు. బ్రేకు లేకపోతే కొత్త జంట అతిలో పడిపోయే ప్రమాదం ఉంది. తద్వారా మొహం మొత్తడాలు, ఊ చాల్లే అని విసుక్కోడాలు, పిలిచినా పలక్కపోడాలు, పలికినా మూతి విరుపులూ ఎక్కువ కావచ్చు. పెళ్ళయిన కొన్నేళ్ళకి ఇలాంటి ఈతి బాధలు ఎట్లాగూ తప్పవు. అలాంటిది మొదటి రోజులలోనే గొడవలలోపడి పోకూడదనే సదుద్దేశంతో ఆషాఢమాసం వాళ్ళ ప్రేమకి కొంచెంసేపు బ్రేకు వేస్తోందని ఫిలాసఫీ.

సైగా....ఎదురు చూడటంలోకూడా ఒక అందముంది. ఎప్పుడెప్పుడాని మనసు యాతన పెట్టడంలో ఒక కిక్కు వుంటుంది. అట్లా వెయిట్ చేస్తూ ఆ గడువు పూర్తి కాగానే కలుసుకోడంలో గొప్ప థ్రిల్లుంటుంది. అందుకోసంకూడా ఆషాఢమాసం వెలిసిందని శాస్త్రకారులు చెబుతున్నారు. మొన్నీ మధ్యనే పెళ్ళి చేసుకున్న కొన్ని జంటలు నాకు తెలుసు. ఆ హీరోలు అంతా నాకు కావలసినవాళ్ళు. పెళ్ళి కాకమునుపు వాళ్ళు కత్తుల్లా తళతళ మెరిసి పోయేవాళ్ళు. రోజుకో సారయినా నాకు ఫోన్‌చేసి ప్రోగ్రాంలు పెట్టేవాళ్ళు. ఆ సినిమా కెడదాం, ఈ నాటకాని కెడదామని నా ప్రాణాలు తిన్నారు. వాళ్ళంటే బ్రహ్మచారులు ఎట్లా అఘోరించినా ఫర్లేదు. పెళ్ళాం, పిల్లలూ, బోలెడు సంసారం బాధ్యతలున్న నేను వాళ్ళ ఆహ్వానాలకు బలై పోయి, ఇంట్లో వాళ్ళచేత నిష్ఠూరాలుకూడా పొందివున్నాను.పార్టీలు గర్రాల

పేరిట అర్ధరాత్రో, అపరాత్రో యిల్లు చేరుకుని పిల్లలతోనూ, వాళ్ళ తల్లి తిట్లు తిని ఉన్నాను. నన్నిట్లా చంపుకుతినడం న్యాయంకాదు ఫ్రెండ్సూ, అని బ్రహ్మచారి స్నేహితులకు ఎన్నో విధాలా చెప్పి చూచేనుగాని వాళ్ళకి కనికరం లేకపోయింది.

నాగపూరునుంచే ఎవడో మిలట్రీ ఫ్రెండు వచ్చేడని ఎవ్వడో ఫ్రెండ్ ఫోన్ చేసేవాడు. మిలట్రీ ఫ్రెండంటే నాకు చాలా యిష్టం. దేశాన్ని కాపాడే హీరో అని దేశంతోపాటు నేనుకూడా అనుకుంటాను. వదిలేయండి.తక్కువ ధరతో ఎక్కువ సీసాలు వాళ్ళ దగ్గరే దొరుకుతాయని నాకు బాగా తెలుసు. మిలట్రీ అని పేరు వినగానే ఇంటి ప్రోగ్రాములన్నీ బంద్. పెళ్లాం,పిల్లలతో సినిమాకి వెళదామని ఆ ఉదయమే చెప్పిన మాటని బొత్తిగా ఖాతరు చేయకుండా ఫ్రెండ్సు చెప్పిన వెన్యూకి హాజరైపోయి, ఏ అర్ధరాత్రికో ఆటోలో వచ్చి ఇంటిలో దిగేవాడిని. ఇంట్లోవాళ్ళు ఏవన్నందీ తిట్టుకుంటున్నారంటే తిట్టుకోరూ మరి?

అట్లాంటిది నా అదృష్టం కొద్దీ బ్రహ్మచారి ఫ్రెండ్స్‌లో మెజారిటీ సంఖ్యకి ఈ ఏడాది పెళ్ళిళ్ళయ్యేయి. వాళ్ళ పెళ్ళిళ్ళ పుణ్యమాని నాకు వాళ్ళనుంచి ఫోన్లు రావడం తక్కువయ్యేయి. ఫోను రానప్పుడు యింక పార్టీలకూ, సింగినాదాలకు చోటెక్కడ? ఎవ్వడికి వాడు బిజీగా వుంటున్నాడు. భార్యామణితో సినిమాలకూ, సరదాలకూ ప్రోగ్రాంలు పెట్టుకుని నన్ను మరచిపోయేరు. నేను ఫోను చేసినా సారీ గురూ, రాలేమని యెంతో నిర్దయతో సమాధానాలు చెబుతున్నారు. మరీ ప్రాణంతీస్తే ఆఫీస్‌లో వుండికూడా లేడని చెప్పిస్తున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు కానప్పుడు పెళ్ళయినవాణ్ని నా ప్రాణాలు తీయడంలో కనిపించిన న్యాయం, నేను వాళ్ళని డిస్టర్బ్‌చేస్తే మహా పాపమని నాకు నీతులు చెప్పేరు.

ఏతా వాతా పెళ్ళిళ్ళ సీజను పుణ్యమాని నేనెంతో ప్రశాంతంగా కాలం గడిపేను. నా భార్యా, పిల్లల కే నా టైమంతా కేటాయించేను. అప్పుడప్పుడు కొత్త జంటలు మా యింటికి వచ్చి పదినిమిషాలు కూచుని వెళ్ళడం మినహాయించి నన్ను ఇబ్బందుల పాలు చేయలేదు. సినిమా హాలులోనో, ప్లెక్ గార్డెన్స్‌లోనో వాళ్ళు కలిసినా హల్లో అంటే హల్లో అనుకుని వెళ్ళిపోయే

వాళ్ళం. పెళ్ళిళ్ళయిపోతే స్నేహాలు హాల్లో దగ్గరే ఆగిపోతాయని డైరీలో కూడా రాసుకున్నాను.

అల్లాంటి నా పాలిట యమరాక్షసిలా ఈ ఆషాఢమాసం వచ్చి కూచుంది. పెళ్ళిళ్ళు చేసుకున్న వాళ్ళకిది విరామ సమయం కదా! మళ్ళా నా ప్రాణాలు తీస్తున్నారు. రోజు కిరపై ఫోనులు తగులుకుంటున్నాయి. గురువుగారూ అక్కడికి రండి, ఇక్కడకు రండని ఆహ్వానాలు పెరిగిపోతు న్నాయి.కొందరు గడ్డాలు పెంచుకున్నారు. కొందరు ఏదో పోగొట్టుకున్నట్టు అ స్తమానం బెంగపడిపోతున్నారు. కొందరు పిచ్చివాళ్ళయ్యేరు. వాళ్ళ వియో గాన్ని నాకు వినిపించి బోరుకొడుతున్నారు. కేలండరులో ఆషాఢమాసాలు ఎ త్తేయ్యాలని మందు పట్టులో అరుస్తున్నారు. ఆషాఢ మాసమంటే యెన్ని నెలలుంటుందని వొక బాధితుడు నన్ను అడిగినప్పుడు అవాక్కయిపోయేను. వర్షాకాలం, ఎండాకాలం మాదిరి ఆషాఢమాసం కూడా వొక సీజనుగా భావించి అతను భయపడుతున్నట్టు గమనించేను. మాసమనగా నెల అని చెప్పేను. ఆషాఢమాసం కరెక్టుగా ఒక్క నెలరోజులు మాత్రమే వుంటుందని హామీ ఇచ్చాను. ఆ చల్లటి వార్తకి అతను పులకించిపోయేడు. నా చేతులు అతని కళ్ళకద్దుకున్నాడు. ఈ ఆషాఢమాస బాధితుల్ని ఆ దేవుడే ఆదు కోవాలి.